ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 06.06.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రంగారెడ్డి జిల్లా, కోహెడలో అత్యాధునిక సమీకృత పండ్ల మార్కెట్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరికొద్ది సేపట్లో శంకుస్థాపన చేస్తారు.

2. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 20 న ఎల్బీ స్టేడియంలో సామూహిక యోగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

3. రాష్ట్రంలో ఇసుక ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచడంతో పాటు అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు.

4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ రాత్రికి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది.

**కోహెడ్ మార్కెట్ శంకుస్థాపన**

రంగారెడ్డి జిల్లా కోహెడలో అత్యాధునిక సమీకృత పండ్ల మార్కెట్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరికొద్ది సేపట్లో శంకుస్థాపన చేస్తారు. 179 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల 387 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే ఈ ప్రాజెక్టు , ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో మూడేళ్లలో పూర్తికానుంది. ఈ మార్కెట్ అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా , పరోక్షంగా సుమారు 25 వేల మందికి ఉపాధి

అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం వెల్లడించింది. కోహెడ పండ్ల మార్కెట్ ఉద్యాన రైతులకు వరంగా మారనుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పండ్ల వ్యాపారం , నిల్వ, రవాణా, మార్కెటింగ్‌కు కోహెడ ఫ్రూట్ మార్కెట్ లో సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.

**HYD -PTC**

**KISHAN REDDY-YOGA**

యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని , దేశ సంస్కృతిని ప్రపంచానికి చాటాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 20 న ఎల్బీ స్టేడియంలో సామూహిక యోగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కవాడిగూడలోని సీజీవో టవర్స్ లో నిర్వహించిన యోగా సన్నాహక సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. . యోగాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో, జున్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించేలా కృషి చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. యోగ దినోత్సవం రోజు ప్రతీ ఒక్కరు ఇళ్లలో, కాలనీల్లో యోగా చేయాలని , ఎల్బీ స్టేడియంలో యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**Desk**

**వివేక్ వెంకటస్వామి**

రాష్ట్రంలో ఇసుక ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచడంతో పాటు అక్రమ ఇసుక తవ్వకాలు , రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. ఈరోజు హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) అధికారులతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష

సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక లభ్యత , నిర్వహణ, ఆదాయ వృద్ధి అవకాశాలు, వ్యవస్థలో చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఇసుక నిర్వహణకు సంబంధించిన అన్ని కార్యకలాపాల్లో పారదర్శకతను పాటించాలని , లారీల కదలికలను నిరంతరం పర్యవేక్షించేలా కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

**desk**

**చేప ప్రసాదం పంపిణీ**

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మృగశిర కార్తె చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి , ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పరిశీలించారు. ఈనెల 8న రాత్రి 9 గంటలకు ప్రారంభమై, 9వ తేదీ రాత్రి వరకు నిరంతరాయంగా ప్రసాదం పంపిణీ సాగుతుందని , చివరి వ్యక్తి వరకు అందిస్తామని మంత్రులు స్పష్టం చేశారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో 1.40 లక్షల కొర్రమీను చేప పిల్లలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ వేసవి దృష్ట్యా ఫ్యాన్లు , కూలర్లు, తాగునీరు, నిరంతర విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. తొక్కిసలాట , ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సిసి కెమెరాలు , కంట్రోల్ రూమ్ ద్వారా నిఘా ఉంచాలన్నారు. మెడికల్ క్యాంపులు , సిపిఆర్ బృందాలు , ఫైర్ ఇంజన్లు సిద్ధం చేయాలని సూచించారు.

**HYD –PTC**

**దామోదర్ రాజనర్సింహ**

హైదరాబాద్ లోని సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిలో వైద్య సేవల సంసిద్ధతను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించారు. ఓపీ , ఐపీ, ఎమర్జెన్సీ, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లను తనిఖీ చేసిన మంత్రి.. ప్రారంభానికి ఉన్న పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతులు, సిబ్బంది అందుబాటుపై సమీక్షించారు. నీటి సరఫరా , విద్యుత్,

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం అందించడమే  ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**HYD -PTC**

**సుఖేందర్ రెడ్డి**

హైదరాబాద్, హైటెక్స్ లో ఏర్పాటు చేసిన "పోచంపల్లి థ్రెడ్" వస్త్ర ప్రదర్శనను    శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఈరోజు సందర్శించారు. ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా హాజరై అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్   ను తిలకించి, చేనేత వర్తకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ..   . పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఖ్యాతి ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో ఢిల్లీలోని సహచర ఎంపీలకు         ,  కేంద్ర మంత్రులకు పోచంపల్లి శాలువాలను బహూకరించి భూదాన్ పోచంపల్లి చేనేత వస్త్రాల గొప్పతనాన్ని వివరించేవాడినని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

డెస్క్

**కలెక్టర్ గరిమ అగర్వాల్**

ప్రతి ఇంట్లో ని చెత్తను నాలుగు రకాలుగా వేరు చే     సి,  పారిశుధ్య వాహనాలకు ఇవ్వాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ పిలుపు నిచ్చారు.      రామన్నపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు కలెక్టర్ హాజరై మాట్లాడుతూ...

బైట్ ... కలెక్టర్ గరిమ అగర్వాల్

పిటిసి, సిరిసిల్ల

**హరీష్ రావు**

రాష్ట్ర ప్రభుత్వం మాటలు కట్టిపెట్టి ఎలాంటి కోతలు లేకుండా యుద్ధప్రాతిపదికన తక్షణమే వడ్లను కొనుగోలు చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట

నియోజకవర్గ పరిధిలోని నారాయణరావుపేట మండలానికి చెందిన రైతు పల్లెపేని కనకయ్య గుండెపోటుతో మృతి చెందగా, ఈరోజు హరీష్ రావు ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, వడ్ల కొనుగోలులో జరుగుతున్న ఆలస్యం వల్లే రైతు కనకయ్య ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని ఆరోపించారు. కనకయ్య పండించిన వడ్లను మార్కెట్ యార్డ్‌లో దాదాపు 45 రోజుల పాటు కొనుగోలు చేయకుండా ఆలస్యం చేశారని , ఇటీవల కురిసిన వర్షాలకు ఆ వడ్లన్నీ తడిసిపోయాయని పేర్కొన్నారు. తడిసిన వడ్లను రైస్ మిల్లుకు తీసుకెళ్లగా మిల్లర్లు భారీగా తరుగు కోత విధించారని, ఆ ఆందోళనతోనే రైతుకు గుండెపోటు వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పిటిసి, సిద్దిపేట

**సుదర్శన్ రెడ్డి**

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను మరింత బలోపేతం చేయడంలో భాగంగా ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత డీఆర్డీఏ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను ఆయన ఈ రోజు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ఎన్నికల సామాగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని , భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈవీఎంల నిర్వహణలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

**పీటీసీ, సంగారెడ్డి**

**ప్రపంచ పర్యావరణ దినోత్సవం**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా వన్యప్రాణులు, పక్షుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మంథని అటవీ రేంజ్ అధికారి ఎం. వినయ్ నాయక్ అన్నారు. ఈరోజు ముత్తారాం మండలంలో "బర్డ్ వాక్స్ అండ్ వైల్డ్ లైఫ్ అవేర్‌నెస్ " కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో పక్షులు, వన్యప్రాణులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. జీవ వైవిధ్య పరిరక్షణ ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. అడవులు, చెరువులు, సహజ వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు.

**పిటిసి, పెద్దపల్లి**

**వాతావరణం**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో పాటు వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షం నమోదవుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆకాశం పూర్తిగా మేఘావృతమై, ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడుతోంది. ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షాల వల్ల వాతావరణం చల్లబడి ఉపశమనం లభించింది. కాగా, వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

డెస్క్

**బీజేపీ ఎమ్మెల్యే**

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నుండి ప్రస్తుత కాంగ్రెస్ పాలన వరకు సుమారు 14 వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో

ఉన్నాయని వెల్లడించారు. దీనివల్ల 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతోందని, సర్టిఫికెట్లు అందక యువత డెలివరీ బాయ్స్‌గా మారడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కనీసం 4 వేల కోట్ల రూపాయలు విడుదల చేసి గ్రామీణ విద్యాసంస్థలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో స్పందించకుంటే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

**పీటీసీ హైదరాబాద్**

**హనుమకొండ జిల్లా కలెక్టర్**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను బూత్ లెవెల్ అధికారులు మరింత వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. ఈరోజు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నూతన బీఎల్వోలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. .. ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఈ ప్రక్రియలో మెరుగైన పురోగతి సాధించాలని కలెక్టర్ సూచించారు.

**పిటిసి, వరంగల్**

**భువనగిరి ఎమ్మెల్యే**

యాదాద్రి భువనగిరి జిల్లా , సంగెం గ్రామ సమీపంలోని భీమలింగేశ్వర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. భీమలింగాన్ని ఆయన ఈరోజు సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. భీమలింగేశ్వర స్వామి దేవాలయం

నిర్మాణం కోసం ఇప్పటికే 2 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. దేవాలయ నిర్మాణం , బ్రిడ్జి నిర్మాణంతో పాటు సమగ్ర అభివృద్ధి కోసం సుమారు 50 కోట్ల రూపాయలతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

**యాదాద్రి భువనగిరి , పీటీసీ**

**వరంగల్ కలెక్టర్**

ప్రధాన పంటలతో పాటు కందులు, కూరగాయలు, బంతిపూలు వంటి అంతర పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం లభిస్తుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈరోజు దుగ్గొండిలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో, రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాల మేరకు తక్కువ నీటితో పండే వరి వంగడాలను ఎంచుకోవాలని సూచించారు.

పిటిసి, వరంగల్

**భద్రాద్రి కొత్తగూడెం**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక విజయవంతంగా అమలవుతోందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈరోజు కారుకొండ రామవరంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని.. విద్య , వైద్యం, పారిశుద్ధ్యం, అంటువ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులు పంట మార్పిడి, శాస్త్రీయ సాగు పద్ధతులు అవలంబించాలని, గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం

చేయడంతో పాటు, ‘బడిబాట’ ద్వారా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల చేరికలను పెంచాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రహదారులు , విద్యుత్, తాగునీటి సమస్యలపై గ్రామస్థులు ఇచ్చిన వినతులపై తక్షణమే చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం